క్లుప్తంగా

మొబైల్స్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

గద్వాల క్రైం: మొబైల్స్ వినియోగంపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోనుపాడులోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు, స్నేహితుల రిక్వెస్టులపై స్వీయ నియంత్రణ ఉండాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యం వైపు అడుగులు వేసి ఉన్నత స్థానంలో చోటు దక్కించుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులు కావద్దన్నారు. ఏదైనా సమస్యలుంటే 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆనంద్ తదితరులు ఉన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి సన్మానం



గట్టు: మండలంలోని తుమ్మలపల్లికి చెందిన వైద్య విద్యార్థి రవీంద్రనాయుడును బీఎస్పీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన రఘునాయుడు కుమారుడు రవీంద్రనాయుడు నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. దీంతో బీఎస్పీ గద్వాల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజు, పట్టణ అధ్యక్షుడు బోయ ముండ్ల రవి, కేశవరెడ్డిలు పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

రేపు సర్వసభ్య సమావేశం

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

చనిపోయిన రైతులకు రుణమాఫీ వర్తింపచేయాలి



రాజోళి: ప్రభుత్వం చెప్పిన కటాఫ్ డేట్‌లో రుణాలు తీసుకుని మరణించిన రైతులకు కూడా రుణమాఫీ వర్తింపచేయాలని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రం రైతులు యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం రుణాలు తీసుకున్న రైతులు కొందరు చనిపోయారని, వారి బ్యాంకు ఖాతాలను అధికారులు మూసివేశారని, వారిని గుర్తించి నామినీలుగా ఉన్న వారికి రుణమాఫీ వర్తింపచేయాలన్నారు.

ఉచిత విద్యకోసం విద్యార్థుల ఎంపిక

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ శివ శివాని పాఠశాలలో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను ఎంపిక చేశారు. శివశివాని హైస్కూల్‌లో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించడంతో విద్యార్థులు దరఖాస్తు చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి హృదయరాజు, వడ్డేపల్లి ఎంఈఓ ఆధ్వర్యంలో బుధవారం లాటరీ తీశారు. ఆయా మండలాలకు చెందిన నలుగురు విద్యార్థులను డిప్ పద్ధతిన ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య అందించనున్నట్లు పాఠశాల యజమాని శ్యాంసుందర్ తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్, స్కూల్ యూనిఫాంలు అందజేశారు.

మిరపనారు పారవేత



ఉండవెల్లి: వర్షం పడకపోవడంతో మిరపనారు ఎండిపోతుందని రైతులు పారవేశారు. అలంపూర్ చౌరస్తాలో ప్రతి ఏడాది మిరప నారు అమ్మడానికి తీసుకొస్తున్న రైతులు ఈసారి ఎవరు కొనకపోవడంతో రోడ్డు పక్కన పారేసి వెళ్లిపోయారు.

కనుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



కేటీదొడ్డి: మండలంలోని కేటీదొడ్డి, కొండాపురం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలోని కృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు ఉన్నారు.

కోతుల బెడద!



ఉండవెల్లిలో భవనంపై ఉన్న కోతులు



రోడ్డుపై అడ్డంగా కూర్చున్న కోతులు

- ఇళ్లు, దుకాణాల్లో చొరబాటు..
- విద్యుత్, కేబుల్ వైర్లను కట్ చేస్తున్న వైనం
- ఎన్ని వినతులిచ్చినా పట్టించుకోని అధికారులు, పాలకులు

ఉండవెల్లి: కోతుల చేష్టలకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లలోకి, దుకాణాల్లోకి చొరబడి కనిపించిన వస్తువులను పట్టుకెళ్తున్నాయి. తాళం వేసిన ఇండ్లను సైతం వదలకుండా కిటికీల్లో దూరి వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. కోతుల బెడద తగ్గించుకోవాలని గ్రామస్తులు కొండముచ్చును తీసుకొచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

ఉండవెల్లిలో అధికం..

ఉండవెల్లిలో ఏ భవనం మీద చూసిన కోతుల స్థావరాలే. ఊరి మొదలు చివరి దాకా దాదాపు వేల సంఖ్యలో కోతులు ఉన్నాయి. కోతులను పట్టించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసినా, ఊరికి అరిష్టం జరుగుతుందని గ్రామస్తులు అడ్డుపడ్డారు. ప్రజలున్న చోటే కోతులు ఉండడంతో ఏ పనిచేసుకోవాలో అయోమయంలో ఉన్నారు. దుకాణాలు, ఇండ్లకు ఇనుప కడ్డీలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు.

దుకాణాల్లో వస్తువులు కొనాలన్న భయమే..



దుకాణాల్లో ఏవైనా వస్తువులు కొంటే కోతులు దాడి చేసి లాక్కెళ్తాయని భయపడుతున్నారు. చిన్నారులు కొనే తిరుబండారాలను కోతులు దాడి చేసి తీసుకెళ్తున్నాయి. వెంటనే కోతులను పట్టించేందుకు ఏర్పాట్లు చేయాలి.

– మహేశ్వరి, స్వీట్ షాప్ యజమానురాలు, ఉండవెల్లి

చందాలు వేసుకుంటున్నాం..



ఏ గ్రామంలో కోతులు ఇంతగా ఉండవు. మా గ్రామంలో చాలా కోతులున్నాయి. చిన్న సంచిని బయటికి తీసుకెళ్లినా మీదికి ఎగబడుతాయి. ఇప్పటికైనా కోతుల బెడద నుంచి రక్షించాలి. చందాలు వేసుకొని వాటిని పట్టించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– జీవన్ కుమార్, ఉండవెల్లి

ఆదర్శగ్రామాలే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: నియోజకవర్గంలో ఆదర్శ గ్రామాలను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని పెద్ద తాండ్రపాడు, చింతల్ క్యాంపులో ఆయన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రతిపక్షాల్లో వణుకు పుడుతుందన్నారు. ప్రభుత్వం ఇక్కడ అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో కాపీ కొట్టి ప్రజలకు అందిస్తున్నారని, మరి కొన్ని చోట్ల ఆ పథకాలతోనే పార్టీలు అధికారంలోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేణుక, ఆర్డీఎస్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రైతుల వినతి..

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు కెనరా బ్యాంకు రుణాలను మాఫీ చేయించాలని ఎమ్మెల్యే అబ్రహంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు ఈదన్న, మద్దిలేటి, రాముడు, గోవర్దన్, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అయిజ మండలం ఉప్పరి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షల ప్రొసెడింగ్ కాపీని ఆయన అందజేశారు. రాజోలి మండలం పెద్ద తాండ్రపాడులో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ ఏలియా ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అయిజ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్వీ నాయకులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉప్పరి కులసంఘం పెద్దలు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్

మానవపాడు: మండల కేంద్రంలో ఉదయం 10గంటలకు ఎంజీఎన్ఆర్ఎస్‌పై సోషల్ ఆడిట్ సంబంధించిన సమావేశం ఏర్పాటు చేశామని, గౌరవ సభ్యులు, సర్పంచ్‌లు, ఉపాధిహామీ సంబంధిత అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ రమణ రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



గద్వాల: జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణం క్రమబద్ధీకరించాలని, తమ ఉద్యోగ జీవితాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన రిలేదీక్షలు పదో రోజు కొనసాగాయి. బుధవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్ష శిబిరంలో ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు హుసేనప్ప, గోపాల్ మాట్లాడారు. కేజీబీవీ సీఆర్‌టీలు, సీఆర్పీలు, డీఎల్ఎంటీ, సీసీఓ, పీటీఐ, యూఆర్ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల వివరాల నమోదు చేయాలి

గట్టు: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లోని ఆయా వీధుల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాల వివరాలను పోలీస్ పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఎస్ఐ నందీకర్ తెలిపారు. జిల్లా ఎస్పీ సృజన ఆదేశాల మేరకు గణేష్ మండప నిర్వాహకులు ఈ నెల 18లోపు పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా చేసుకునేందుకు అందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు. పూర్తి వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని ఎస్ఐ సూచించారు.

19లోగా ఓటరు నమోదు పూర్తి చేయాలి



అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఆర్డీఓ

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో బీఎల్వోలకు, పొలిటికల్ లీడర్లకు ఓటరు నమోదుపై ఆర్డీఓ చంద్రకళ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బుధవారం అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు మండలాలకు చెందిన బీఎల్వోలకు, తహసీల్దార్లకు, డీటీలకు, రెవెన్యూ సిబ్బందికి ఓటరు నమోదు ఈ నెల 19వరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కొత్త ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి నమోదు చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో సిబ్బందికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డీటీలు, బీఎల్వోలు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



వంటలు చేస్తున్న మహిళలు



విజేతకు బహుమతి అందచేస్తున్న అధికారులు

రాజోళి: చిరుధాన్యాలతో వండిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని శాస్త్రవేత్తలు భోగారాయ్, భవాని, అనిత అన్నారు. మండలంలోని తూర్పు గార్లపాడులో బుధవారం చిరుధాన్యాల వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రాగులు, కొర్రలు, సద్దలు తదితర చిరుధాన్యాలతో వంటలు చేశారు. ఉసేనమ్మ వండిన సద్ద అన్నం, రాగి సంకటి, పాలముద్ద అత్యంత రుచికరంగా ఉండడంతో అధికారులు ఆమెను విజేతగా ప్రకటించారు. ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవితంలో చిరుధాన్యాలను చేర్చుకోవాలని, దీని వల్ల బీపీ షుగర్ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందురావ్, సర్పంచ్ శేషమ్మ, ఏఈఓ ఇబ్రహీం, పంచాయతీ సెక్రటరీ ఖలీం పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక పండుగ సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తప్పనిసరిగా సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి ఈనెల 18లోపు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ అశోక్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ మండపాల దగ్గర డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. తప్పకుండా విద్యుత్‌శాఖ నుంచి కరెంట్ కోసం అనుమతి తీసుకొని మీసేవ ద్వారా బిల్లు చెల్లించాలన్నారు. పోలీసు వారికి సహకరించాలన్నారు.

ఆన్‌లైన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలగురించి విద్యార్థులకు వివరిస్తున్న సీఐ శివశంకర్‌గౌడ్

శాంతినగర్: విద్యార్థులు, పెద్దలు ఎలక్ట్రానిక్ వస్తువులైన మొబైల్స్, ట్యాబ్స్, కంప్యూటర్ వంటివి ఆన్‌లైన్‌లో బుక్ చేసే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్ ప్రజలకు సూచించారు. వడ్డేపల్లి కేజీబీవీలో సీఐ శివశంకర్‌గౌడ్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రతలు తీసుకోవాలని విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సైబర్ నేరానికు గురైన వెంటనే 1930 నంబర్‌కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు వేధింపులకు గురైతే షీ టీం నంబర్ 8712670312కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శాంతినగర్ పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురంలో ఎస్ఐ అశోక్‌బాబు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షీ టీమ్, పోలీస్ కళాబృందం సభ్యులు హాజరై గ్రామ ప్రజలకు పాటలు, మాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీమ్, కళాబృందం సభ్యులు రాధమ్మ, హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, లోకేశ్వరి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి బుధవారం పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలను పరిశీలించిన ఇన్‌చార్జ్ ఎంఈఓ



రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ

అయిజ: మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ బుధవారం పరిశీలించారు. ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న 'మన ఊరు–మనబడి' పనులను పరిశీలించారు. సంతబజారులోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అనంతరం ప్రైవేటు పాఠశాలలను సందర్శించారు. పీఈటీ పరీక్ష నిర్వహణకు మండల కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి కేంద్రంలో 240 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. గురువారం నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని పాఠశాలల యాజమాన్యాన్ని కోరారు.

జిల్లాస్థాయి కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులకు ప్రశాంసా పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు: ఎస్‌జీఎఫ్ 67వ జిల్లా స్థాయి కరాటే పోటీలకు ధరూరు విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో స్టేట్ సెక్రటరీ శ్రీహరి మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ధరూరు విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు మాస్టర్ రషీద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, పీఈటీ శ్రీనివాసులు, ఎస్‌జీఎఫ్ చేర్న్ జితేందర్‌లు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అవార్డు అందజేత

శాంతినగర్: టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించినందుకుగాను మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణను బుధవారం కలెక్టర్ అభినందించారు. టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి పౌష్టికాహారం అందజేసినందుకు నిక్షయ మిత్ర అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'లో మెరిసిన ఉండవెల్లి



ఉండవెల్లి గ్రామ పంచాయతీ

ఉండవెల్లి: పారిశుద్ధ్యం, తడి, పొడిచెత్త వివిధ అంశాల నిర్వహణను ప్రామాణికంగా స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023లో జిల్లా మొత్తంలో ఉండవెల్లి గ్రామ పంచాయతీ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికై ంది. ఇటీవల ప్రభుత్వం లిస్టు విడుదల చేసింది. ఇండ్లలో మరుగుదొడ్ల వాడకం, తడి, పొడి చెత్త, కంపోస్టు షెడ్లు, మురుగునీరు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఉండవెల్లిని ఎంపిక చేశారు. దీంతో సర్పంచు రేఖ, పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో కేవలం ఉండవెల్లి గ్రామ పంచాయతీ ఒక్కటే ఎంపిక అయ్యిందని.. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజలందరు ఎంతో సహకరించాలని, రాష్ట్ర స్థాయిలో ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ పేర్కొంది.

పాలకుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం



ఆర్డీఎస్ కెనాల్‌లో ఆందోళన చేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

శాంతినగర్: పాలకుల నిర్లక్ష్యం ఆర్డీఎస్ రైతులకు శాపంగా మారిందని నడిగడ్డ హక్కుల పోరాటసమితి అలంపూర్ సమన్వయకర్త క్రాంతిదళ్ నాగేష్ అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం సమీపంలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో ఎన్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా క్రాంతిదళ్ నాగేష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభంలోనే ఆర్డీఎస్ ఆయకట్టు కింద పత్తి, మిరప, ఉల్లిగడ్డ, మొక్కజొన్న, వరి పంటలు రైతులు సాగుచేశారన్నారు. తుమ్మిళ్ల లిఫ్ట్ పరిధిలో మల్లమ్మకుంట, జూలెకల్, వల్లూరు వద్ద మూడు రిజర్వాయర్లు నిర్మించి భవిష్యత్‌లో సాగునీటి సమస్యల తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వీరేష్, కిషోర్, నరేష్, రాజ్‌కుమార్ ఉన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి

- సీడీపీఓ కమలాదేవి



మల్దకల్‌లో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పోషణమాసంను పురస్కరించుకుని బుధవారం మల్దకల్‌లో సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాలు ఎక్కువ ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, బాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీరంగమ్మ, సురేఖ, మహేశ్వరమ్మ, పుష్పమ్మ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ కార్డు ప్రతిఒక్కరు తీసుకోవాలి

అలంపూర రూరల్: ఆయుష్మాన్‌భవ ప్రతి ఒక్కరు తీసు కోవాలని మండల వైద్యాధికారిణి ప్రసూన రాణి సూచించారు. రాష్ట్రపతి చేతులమీదు ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అమె తెలిపారు. ఈ ఆయుష్మాన్ వల్ల దేశంలోని ప్రభుత్వ , ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు చేయించుకోవచ్చన్నారు. క్యాతూర్, గొందిమల్ల, తక్కశిల, సుల్తాన్‌పూర్, అలంపూర్, లింగన్‌వాయిపల్లె దవఖానలో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రామస్వామి, ప్రతిభస్ఫూర్తి ఉన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, పుల్లూరు, బొంకూరు గ్రామాల్లోని వైద్య ఉప కేంద్రాలలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సత్యనారయణ, వైద్యులు సంధ్య, పుల్లూరులో సర్పంచు నారాయణమ్మ, ఏఎన్ఎంలు షాజహాన్ పాల్గొన్నారు.

మానవపాడు: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో ఉచిత మందులు, ఔట్ పేషంట్ సేవలు అందిస్తామని డాక్టర్ రిజ్వానా తస్వీర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జయమ్మ

మల్దకల్: ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేదిక్ డాక్టర్ జయమ్మ సూచించారు. బుధవారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ఏకగ్రత ఉంటుందన్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, శివకుమార్, గోవర్ధన్, భాగ్యలక్ష్మి, వైద్యసిబ్బంది మహేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



మాట్లాడుతున్న ఏమేలమ్మ

గద్వాల అర్బన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ అన్నారు. ఈ మేరకు బుధవారం నుంచి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్ రోడ్డులో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మంత్రి చర్చలకు పిలిచి సమస్యలపై ఇప్పటి వరకు స్పందించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం , ఉద్యోగ భద్రత, ప్రమాద, ఆరోగ్య బీమా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహ మద్దతు తెలిపారు.